
# రెక్కలొచ్చిన పక్షి



గన్నవరపు నరసింహమూర్తి



సుప్రభాతవేళ. తూర్పుదిక్కు సింధూరవర్ణాన్ని సంతరించుకొంటోంది. దూరంగా ఆలయంలో ఎమ్మెస్ సుబ్బలక్ష్మి 'భజగోవిందం' మంద్రంగా వినిపిస్తోంది. ఆ ప్రత్యూషపు ఉదయాన కౌసల్య యింటిముందు ముగ్గువేస్తోంది. తెల్లవారి నాలుగు గంటలకే లేవడం ఆమెకు అలవాటు. నెలరోజుల క్రితం వరకూ ఈ ముగ్గులు వేయడం వంటి పనులన్నీ కోడలు లలిత చూసుకునేది. కొడుకు రఘురాంకి హైదరాబాద్ బదిలీ కావడంతో వాళ్లు వెళ్లిపోయారు. యింట్లో తను, భర్తే. మళ్లీ ఒంటరివాళ్లైపోయారు. ఈ ఒంటరితనం ఆమెకు మొదటినుంచీ అలవాటే.

ముగ్గులు వేయడం పూర్తవడంతో ఆమె అలవాటు ప్రకారం పంజరం వైపు చూసింది. అందులో తను ఎంతో ప్రేమతో పెంచుకుంటున్న రామచిలుక లేదు. సంవత్సరం క్రితం ఆమె తమ పల్లెకి వెళ్లినపుడు తమ రైతు యిచ్చాడు దాన్ని. ఆకుపచ్చగా, ఎర్రని ముక్కుతో ఎంతో అందంగా ఉన్న ఆ చిలుకను ఎంతో ప్రేమతో పెంచుతోంది ఆమె. లేచిన దగ్గర్నుంచి తన వెంటే ఉంటుంది. యిప్పుడిప్పుడే చిన్నచిన్న మాటలు కూడా నేరుస్తోంది. తను ఏదంటే అది కూడా అదే అంటూ ఉంటుంది. రాత్రి పూటే దాన్ని పంజరంలో ఉంచుతుంది. మిగతా సమయమంతా యిల్లంతా తిరుగుతూంటుంది.

ముఖ్యంగా ఆమె ముగ్గులు వేస్తూంటే దాని అల్లరి చూడాలి... అలాంటిది ఈరోజు దాని అలికిడి లేకపోవడంతో ఆమెకు గాబరా ఎక్కువైంది. కొంపతీసి ఎగిరిపోలేదు కదా అన్న అనుమానం ఆమెలో ప్రవేశించింది. మరో అరగంట సేపు దాన్ని వెదకి, భర్త ఆనందరావుకి ఆ విషయం చెప్పింది. యిద్దరూ కలిసి వెదుకుతూంటే తనే మళ్లీ అరుచుకుంటూ యింట్లోకి వచ్చింది. దాన్ని చూడగానే కౌసల్యకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లయింది.

సంవత్సరం నుంచి దాన్ని తన పిల్లగానే పెంచింది. అదీగాక కొడుకు, కోడలు హైదరాబాద్ వెళ్లిపోయిన తరువాత నుంచి ఆమెకు దానితోటే కాలక్షేపం. యిక ఆనందరావ్‌కి రిటైరైన దగ్గర్నుంచి యింటిపనితో పాటు ఆ చిలుక పలుకులు వింటూ కాలంగడపడం అలవాటైంది.

ఒక్కగానొక్క కొడుకు రఘురాంకి పెళ్లయినా ఊళ్లోనే ఉద్యోగం కాబట్టి మొదట్లో ఆ దంపతులకే సమస్యా లేదు. అందరూ కలిసే

ఉండేవారు. పైగా స్వంతిల్లు. కోడలు లలిత కూడా వాళ్లతో త్వరగానే కలిసిపోయింది. అత్తా కోడళ్లు కలిసి అన్ని పనులూ చేసుకునేవారు.


కానీ ఆర్నెల్ల క్రితం రఘురాం పిడుగులాంటి వార్త చెప్పాడు... తనకు హైదరాబాద్ బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫర్ అయిందని. ఆ మాట విన్న తరువాత కౌసల్యకు నోటమాట రాలేదు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు తమను విడిచి ఈ వయస్సులో వెళ్లిపోతే తాము ఒంటరి వారైపోతామని ఆమె బెంగ. అదీగాక రిటైరైన దగ్గరనుంచి ఆనంద రావ్ ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంటోంది. ముఖ్యంగా చిన్నప్పట్నించీ తాము కొడుకుని విడిచి ఉండలేదు. ఈ విషయంలో రఘురాం కూడా అంతే. అతనికి తల్లిదండ్రులంటే ప్రాణం. తండ్రి మాట అతనికి వేదం. అందుకే పెళ్లయిన తరువాత కూడా వారితో కలిసున్నాడు. కోడలు లలిత విషయమే కౌసల్యకి యిప్పటికీ అర్థంకాదు. కానీ ఆమెని లోతుగా గమనిస్తే ఆమె ప్రవర్తనను బట్టి ఆమెకి తమతో కలిసి ఉండటం యిష్టంలేదన్న సంగతి అర్థమవుతుంది. కానీ ఆమె ఏనాడు బయటపడలేదు.

అందుకే ట్రాన్స్‌ఫర్ ఆర్డర్స్ వచ్చాయని కొడుకు చెప్పగానే ఆమె బాధపడుతూ అంది "రఘూ! మీ నాన్నగారి ఆరోగ్యం అంతంత మాత్రం అని నీకూ తెలుసు. ఈ వయసులో నువ్వు మాకు తోడుగా ఉంటే ధైర్యంగా ఉంటుంది. ఆ ధైర్యంతోనే యిన్నాళ్లూ ఏ చీకూ చింతా లేకుండా గడిపేసాము. కానీ ఈ బదిలీ మాట వినగానే నాకేం తోచడంలేదు. తప్పనిసరిగా వెళ్లవలసిందేనా?"

"తప్పదమ్మా! నేనూ వెళ్ల కూడదని చాలా ప్రయత్నించాము. నేనీ బ్రాంచి కొచ్చి మూడేళ్లకు పైగా అయింది. అదీ గాక హైదరాబాద్ బ్రాంచిలో చాలా ఖాళీలున్నాయట. అందుకని వెళ్లక తప్పదని మా మేనేజర్ చెబుతున్నాడు. ఏం చెయ్యాలో నాకూ తోచటం లేదు" రఘు వివరంగా చెప్పడంతో కౌసల్యకు ఏంచేయాలో తోచలేదు.

రఘు హైదరాబాద్ వెళ్లకతప్పదు అన్న ఆలోచనే ఆమె భరించలేకపోతోంది. "అదేమిట్రా! నీ ఫ్రెండ్ రమణ అయితే ఈ ఊరి బ్రాంచి కొచ్చి ఎనిమిదేళ్లకు పైగా అయింది. మరి ఆయనకు ట్రాన్స్‌ఫర్ రాలేదే?"

ఆ మాటకి రఘుకి బాగా కోపం వచ్చింది. "అదేమిటమ్మా అలా అంటావ్? నాకేదో ఈ ట్రాన్స్‌ఫర్ యిష్టంలాగా మాట్లాడుతున్నావ్. రమణకేదో రికమండేషన్ ఉంది. నాకేం లేవుకదా!



అదీగాక అతను నాకన్నా సీనియర్".

"ఏమోరా! ఈ సమయంలో నువ్వు మాదగ్గ ర లేకపోతే నేను, మీనాన్నగారూ ఒంటరిగా యిక్కడ ఉండటం కష్టం. మేమూ మీతోపాటు హైదరాబాద్ వచ్చేస్తాం. ఈ యింటిని అద్దెకిచ్చే ద్దాం. జాయిన్ అయిన తరువాత ఓ పెద్దయిల్లు చూడు" కంటనీరు తుడుచుకుంటూ అంది.

"తప్పకుండా అమ్మా! జాయిన్ అయిన తరు వాత ఓ పెద్ద యిల్లు తీసుకుంటాను. అప్పుడు నువ్వు, నాన్నగారూ యిద్దరూ వచ్చేద్దురుగాని. అందరం కలిసి అక్కడే ఉందాం! సరేనా. యింక నువ్వు బాధపడొద్దు" అన్నాడు రఘు.

ఆ తరువాత ఒక నెలకు రఘు, లలిత యిద్దరూ హైదరాబాద్ వెళ్లిపోయారు. వాళ్లు వెళ్లిన తరువాత ఆ యిల్లు బోసిపోయింది. మళ్లీ ఆ దంపతులను ఒంటరితనం ఆవహించింది. అప్పట్నించి కొడుకు ఎప్పుడు వస్తాడా, తాము ఎప్పుడు హైదరాబాద్ వెళ్తామా అని ఆ దంప తులు ఎదురుచూస్తూ కాలం గడిపేస్తున్నారు.

కౌసల్యకు తాము తప్పుచేసామేమోనని అప్పుడప్పుడూ అనిపిస్తూ ఉంటుంది. రఘుకి ఎమ్మే పూర్తి కాగానే ఊళ్లో ఉన్న ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వస్తే అది కాదని ఎల్.ఐ.సీ.లో జాయినయ్యాడు. తాను వద్దని ఎంత మొరపెట్టుకున్నా తండ్రీకొడుకులు ఆమె మాట వినలేదు. వాడు ఆ ఉద్యోగంలో జాయిన యితే బదిలీలుంటాయి. అదే యిక్కడి కాలేజీలో లెక్చరర్ అయితే జీవితాంతం వాడు మనకు తోడుగా ఉంటాడన్న స్వార్థంతో వాడి జీవితాన్ని పాడుచేసే హక్కు మనకు లేదు. వాడు ఉన్న తమైన స్థానంలోకి వెళ్లాలంటే యిదే సరియైన వయస్సు. ఈ అవకాశాన్ని వినియోగించుకోక పోతే వాడు మనలాగే ఎదుగూ బొదుగూ లేని జీవితం గడపవలసి ఉంటుంది. అలా చేస్తే ఎగురుతున్న పక్షికి రెక్కలు కత్తిరించినట్లవు తుంది".

అతని మాటకు ఆమె దగ్గర సమాధానం ఉండేది కాదు. "అయినా వృద్ధాప్యంలో పిల్లల దగ్గర ఉండాలనుకోవడం స్వార్థం ఎలా అవు తుంది?" బాధతో అడిగేది.


"అన్నీ సవ్యంగా జరిగితే తల్లితండ్రులు వార్థక్యంలో తమ పిల్లలు... అందునా కొడుకు దగ్గర ఉండటమే సమంజసం. కానీ కొన్నిసార్లు అది కుదరదు. మన రోజుల్లో యిన్ని అవకా శాలు ఉండేవి కావు. కానీ ఈ కాలం వేరు. యిక మనగురించంటావా వాడు ముందు సెటి లవ్వనీ అప్పుడు చూద్దాం" అని అనునయించే వాడు ఆనందరావ్.

ఆనందరావ్ భావాలు, ఆలోచనలూ చాలా విశాలంగా ఉంటాయి. అతని ఆలోచనల్లో స్వార్థం ఉండేది కాదు. అతను తండ్రిగా కన్నా ఉపాధ్యాయుడిగానే ఎక్కువగా ఆలోచించేవాడు.

* * * *

కౌసల్య ఆలోచనల్లోంచి తేరుకుంది. గుండె దిటువు చేసుకొని, మళ్లీ పనుల్లోపడింది. రెండు రోజుల తరువాత ఆనందరావ్ మార్నింగ్ వాక్‌కి వెళ్లి వస్తుండగా బీపీ ఎక్కువై కళ్లుతిరిగి పడిపో యాడు. వెంటనే ఆటోలో తమ ఫ్యామిలీ డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లింది కౌసల్య. అతనే ఆనందరావ్ కి రెగ్యులర్‌గా ట్రీట్‌చేస్తుంటాడు. బీపీ, షుగర్ చెక్‌చేసి మరేంఫర్వాలేదని చెప్పి, హాస్పిటల్‌లో రెండురోజులుండాలని చెప్పాడు.

ఆమె ఆ ఊళ్ళోనే ఉంటున్న తన తమ్ముడు రాజశేఖరాన్ని రమ్మనమని ఫోన్‌చేసింది. అతను వచ్చిన తరువాత ఆమెకి కాస్త ధైర్యం వచ్చింది. గాబరాలో ఎక్కడి సామాన్లు అక్కడ వదలి వచ్చే సింది. అతన్ని హాస్పిటల్‌లో ఉంచి తను యింటి కి వచ్చింది. ఆమెకెందుకో నిస్సత్తువ ఆవరిం




చింది. ఎన్నాళ్ళిలా?! పోనీ రఘుని శెలవు పెట్టుకొని రమ్మంటే? అమ్మో! ఆనందరావు ఒప్పుకోడు. మళ్ళీ ఒంటిగంటకు ఆనందరావుకి భోజనం పట్టుకొని హాస్పిటల్‌కెళ్ళింది. ఆమె వెళ్లిన తరువాత మళ్లీ రాత్రి వస్తానంటూ రాజశేఖరం వెళ్లిపోయాడు. ఆనందరావ్ భోజనం అయిన తరువాత ఆమె వచ్చి వరండాలో కూర్చుంది. వరండా అంతా నిర్మానుష్యంగా ఉంది. ఆమె మస్తిష్కం నిండా ఆలోచనల హోరు.

పూర్వం ఉమ్మడి కుటుంబాలు ఎంతో ఆనందంగా ఉండేవి. ఎవ్వరూ ఒంటరితనంతో బాధపడేవారు కాదు. కానీ రోజులు మారిపోయాయ్. యింతలో ఆమె ఆలోచనల్ని బ్రేక్ చేస్తూ 'ఆంటీ' అన్న పిలుపు వినిపించింది. ఎదురుగా రఘు ఫ్రెండ్ సునీల్. యిద్దరూ చిన్నప్పట్నించీ కలిసి చదువుకోవడమే కాకుండా యిద్దరూ ఎల్.ఐ.సి. లో కలిసి పనిచేసేవారు. అతన్ని అప్పుడు అక్కడ చూడగానే ఆమెకు చాలా ఆనందం కలిగింది. బాగున్నావా సునీల్? చాలా రోజులైంది నిన్ను చూసి. మావాడు హైదరాబాద్ వెళ్లిపోయిన తరువాత మాయింటికి రావడమే మానేసావ్" నిష్ఠూరంగా అంది.

"అదేంలేదు ఆంటీ! కొంచెం పనుల బిజీ వల్ల రాలేకపోయాను అంతే. రేపు మా అమ్మకిక్కడ ఆపరేషన్, ఈ రోజు అన్ని టెస్ట్‌లూ చేస్తున్నారు. అందుకే యిలా వచ్చాను".

'అయ్యో! ఏమైంది నాయనా! ఎందుకు ఆపరేషన్?" కౌసల్య ఆత్రంగా అడిగింది.

"ఏం లేదు ఆంటీ! కడుపునొప్పి వస్తోందని చూపిస్తే ఆపరేషన్ అవసరం అన్నారు. చిన్నదే. అదిసరేగాని ఆంటీ! మీరేంటి యిక్కడ ఉన్నారు?"

"మీ మామయ్య గారికి ఒంట్లో బాగోలేదు సునీల్! యిక్కడే జాయిన్ చేసాను. యిప్పుడు కాస్త ఫరవాలేదు. రఘు యిక్కడ ఉన్నన్నాళ్లు మాకెంతో ధైర్యంగా ఉండేది. వాళ్లనాన్నగారికేమైనా ఒంట్లో బాగోలేకపోతే అన్నీ తనే చూసుకునేవాడు. యిప్పుడు వాడు వెళ్లిపోయిన తరువాత ఆ బాధ్యత అంతా నామీద పడింది. నా ఆరో

గ్యం కూడా అంతంత మాత్రమే. ఏం చేస్తాం?" ఆమె కంటనీరు తుడుచుకుంటూ అంది.

"బాధపడకండి ఆంటీ! మేమంతా లేమా? మీరు అధైర్యపడొద్దు".

"అసలు వాడికా ట్రాన్స్‌ఫర్ అస్సలు యిష్టం లేదు సునీల్. వాడికన్నా ఎన్నో ఏళ్లనుంచి పనిచేస్తున్న వాళ్లని వదిలి వీడికి ట్రాన్స్‌ఫర్ ఏంటి చెప్పు?! మరీ అన్యాయం".

"ట్రాన్స్‌ఫర్ వాడికిష్టంలేదా? ఆశ్చర్యంగా ఉంది ఆంటీ! మామయ్యగారి కోసమే తాను హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నట్లు చెప్పాడు రఘు. అక్కడైతే మంచి హాస్పిటల్స్ ఉన్నాయని, వాళ్ల నాన్నగారికి ఎప్పుడు అవసరం పడ్డా మంచి వైద్యం దొరుకుతుందని హైదరాబాద్ రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ కోరుతూ అప్లికేషన్ పెట్టాడు రఘు. అందుకే అతనికి హైదరాబాద్ బ్రాంచికి జోన్ రిక్వెస్ట్ మీద ట్రాన్స్‌ఫర్ అయింది. లేకపోతే హైదరాబాద్ కావలసిన వాళ్లు మా ఆఫీసులో కనీసం పదిమంది ఉన్నారు. వాళ్ల మామగారు హైలెవెల్‌లో రికమండేషన్ చేయించడం వల్ల వాళ్లందరినీ కాదని రఘుకి అయ్యింది. లేకపోతే రఘుకి యింకో నాలుగేళ్ల దాకా అయ్యేదికాదు. అదీగాక తన భార్యకు ఉద్యోగం కూడా దొరుకుతుందని చెప్పాడు" అన్నాడు సునీల్.

అతని మాటలు వినగానే కౌసల్యకు నోట మాట రాలేదు. ఆమె మస్తిష్కం మొద్దుబారిపోయింది. రఘు కావాలనే బదిలీకి అప్లికేషన్ పెట్టాడా?! ఆ విషయం తమకెప్పుడూ చెప్పలేదే... పైగా తనకి ట్రాన్స్‌ఫర్ యిష్టంలేదని ఎన్నోసార్లు అన్నాడు కూడా; అంటే రఘు అబద్ధం ఆడాడా?! ఆ ఆలోచనే ఆమె సహించలేక పోతోంది. ఎలాగోలా సర్దుకొని మళ్లీ అడిగింది.

"బాబు సునీల్! నువ్వు చెప్పింది నిజమేనా? వాడు కోరి ట్రాన్స్‌ఫర్‌కి పెట్టాడా? నేను నమ్మలేకపోతున్నానయ్యా!" దుఖాన్ని దిగమింగుకోవడానికి ఆమె చాలా ప్రయాసపడుతోంది.

"నేను చెప్పేది నిజం ఆంటీ! అప్లికేషన్ పెట్టిన తరువాత ఆఫీసు నుంచి వాడు వాడి మామగారితో ఆ విషయం గురించి నా ఎదురుగా ఎన్నోసార్లు మాట్లాడేడు కూడా! రెండుసార్లు ఆ పని మీద హైదరాబాద్ వెళ్లాడు కూడా; ఆ విషయాలన్నీ మీకు తెలుసనుకుంటున్నాను".

కౌసల్య మౌనంగా వింటూ ఉండిపోయింది. మరో ఐదునిమిషాలు మాట్లాడిన తరువాత 'డాక్టరుగారు వచ్చారు' అంటూ అతను వెళ్లిపోయాడు.

అక్కడ కౌసల్య ఒంటరిగా మిగిలింది. సూదిమొన పడితే వినిపించేటంతటి నిశ్శబ్దం అక్కడ ఆవరించి ఉంది. సునీల్ మాటలు విన్న తరువాత ఆమెకు ఒక్కొటొక్కటీ అర్థం అవసాగాయి. రెండుసార్లు రఘు హైదరాబాద్ తన మామగారికి ఒంట్లో బాగులేక వెళ్లిన విషయం ఆమెకు గుర్తుకొచ్చింది.

యివన్నీ కలిపి ఆలోచిస్తే యిప్పుడర్థమవుతోంది. రఘుకి, కోడలు లలితకీ తమతో కలిసి యిక్కడ ఉండటం యిష్టంలేదన్నమాట. అందుకే వెళ్లి ఆర్నెల్లు అయినా పెద్దయిల్లు దొరకలేదని తమ ప్రయాణాన్ని వాయిదా వేస్తున్నాడు.

ఆ సాయంత్రమే ఆనందరావుని హాస్పిటల్ నుంచి డిశ్చార్జి చేశారు. సునీల్ చెప్పిన విషయాన్ని ఆనందరావుకి చెబితే అతను బాధపడతాడని ఆమె చెప్పడానికి సంశయించింది. ఎందుకంటే రఘుని చాలా ప్రేమగా పెంచాడాయన. అయినా చెప్పక తప్పదు. కానీ చెప్పిన తరువాత ఆనందరావు సమాధానం విని ఆమె ఆశ్చర్యపోయింది.

"కౌసల్యా! రోజులు మారిపోతున్నాయ్. వృ

ర్వంలా పిల్లలందరూ చివరంటా తల్లితండ్రులతో ఉండడానికిష్టపడటంలేదు. వాళ్లు తల్లితండ్రులను తమ ఎదుగుదలకు ప్రతిబంధకంగా తలుస్తున్నారు. అందుకే అవకాశం రాగానే వాళ్ల దారి వాళ్లు చూసుకుంటున్నారు" ఆనందరావు వేదాంత ధోరణిలో అన్నాడు.

కౌసల్యకి దుఖం ముంచుకొస్తోంది. ఎన్నో ఆశలు పెట్టుకొని వాడిని చదివించారు. యిన్ని చేసింది ఈ వయస్సులో ఒంటరిగా బ్రతకడానికా? అదే విషయాన్ని అతనితో చెప్పింది. ఆనందరావు ఆమెని అనునయిస్తూ "నువ్వు అన్నదాంట్లో తప్పులేదు. పక్షిజాతిలో పిల్లలు రెక్కలు రాగానే ఎగిరిపోతాయ్. అవి తల్లితండ్రుల్ని మరచిపోతాయ్. అదే యిప్పుడు మన జీవితాల్లో కూడా చోటుచేసుకుంటోంది. యిదో కొత్త పరిణామం".

"అంటే యిక మనం వాళ్ల దగ్గరకు వెళ్లొద్దంటారా?!" దుఖంతోనే అడిగింది.

"వద్దు... మన బ్రతుకేదో మనమే బ్రతుకుదాం. అదీగాక దూరంగా ఉంటేనే మనుషుల మధ్య అనుబంధాలు పెరుగుతాయి. ఆ విషయమే వాడికి ఉత్తరం వ్రాయి" ముక్తాయింపుగా అన్నాడు ఆనందరావు.

* * *

ప్రత్యూషపు వేళ! దూరంగా ఆలయంలోంచి గుడిగంటల శబ్దం అలలు అలలుగా వినిపిస్తున్నాయి. కౌసల్య పూజాదులు ముగిసాయి. ఆనందరావు మార్నింగ్‌వాక్‌కి వెళ్లడంతో ఆమె డాబాఎక్కి కొడుకు రఘుకి ఉత్తరం వ్రాయసాగింది.

ప్రియమైన రఘుకి,

మీ అమ్మ ఆశీర్వదించి వ్రాయునది. ఈ మధ్యనే మీనాన్నగారి ఆరోగ్యం కొంచెం పాడైంది. డాక్టర్‌గారికి చూపించాను. యిప్పుడు బాగానే ఉంది. మీనాన్నగారికి ఒంట్లో బాగోలేనప్పుడు నువ్వు వస్తే బాగుండనిపించింది. కానీ ఈ వయసులో డాక్టర్ల అవసరం రోజూ రావచ్చు. అన్నిసార్లు నీవు రావడం కుదరని పని; అందుకే ఆ తంటాలేవో నేనే పడ్డాను.

ఇది జరిగిన తరువాత నాన్నగారు యింక హైదరాబాద్ రానంటున్నారు. ఆయనకు యిక్కడే బాగుందిట. తెలిసిన డాక్టరు, తెలిసినవాళ్లు... మరీ ముఖ్యంగా ప్రశాంతమైన వాతావరణం. అదీ గాక స్వంతిల్లు. యివన్నీ వదిలి ఎక్కడికీ రానంటున్నారు. నాకు కూడా అదే మంచిదనిపిస్తోంది. ఈ వయస్సులో అక్కడికొచ్చి మీకు కొత్త యిబ్బందులు కలిగించడం మాకు యిష్టం లేదు. మీనాన్నగారి సంగతి నీకు తెలుసుకదా?

అందుకే యింక పెద్దయిల్లు కోసం నువ్వు ప్రయత్నించవద్దు. యిక్కడ మన స్వంతింట్లోనే శేషజీవితాన్ని గడిపేస్తాం. ఈ విషయాలన్నీ గ్రహించు. కోడలు లలితని అడిగినట్లు చెప్పు. సంక్రాంతికి మీరిద్దరూ కలిసి రండి.

ఉంటాను...

మీ అమ్మ కౌసల్య

ఉత్తరం వ్రాసిన తరువాత ఆమె మనసు ప్రశాంతంగా ఉంది. మేడదిగి క్రిందికి వచ్చింది. ఆమెని చూడగానే పంజరంలో చిలక అరవసాగింది. చెట్టంత కొడుకే ఈ యింటిని పంజరంలా తలచి స్వేచ్ఛకోరి వెళ్లిపోయాడు. అలాంటిది ఈ చిలకని పంజరంలో బంధించడం తప్పేమో అనిపించిందామెకు. ఓ నిర్ణయానికొచ్చింది. పంజరం దగ్గరకు వెళ్లి దాని తలుపు తెరిచి, ఆ చిలకని వదిలివేసింది. అది కాసేపు అక్కడే ఎగిరి, రెక్కలాడించుకుంటూ బయటకు ఎగిరిపోయింది. అలా ఎగురుకుంటూ ఆకాశంలో కలసిపోయి కనుమరుగైపోయింది. ●